
# వానప్రస్థం



అత్తలూరి విజయలక్ష్మి

"వివేక్"

డ్రెసింగ్ టేబిల్ అద్దంలో చూసుకుంటూ తలదువ్వుకుంటోన్న వివేక్ తలతిప్పి చూశాడు.

గుమ్మంలో నిలబడి ఉంది సుశీల.

ఆవిడ మొహం గంభీరంగా ఉంది. కానీ పిలుపులో మాత్రం మార్ధవం నిండి ఉంది.

"ఏమ్మా?" అడిగాడు.

"బైటకెళ్తున్నట్టున్నావు!"

"అవునమ్మా. ఏం? ఏమన్నా కావాలా బైటినుంచి?"

అప్పుడప్పుడు బైటనుంచి తేవాల్సిన వస్తువులు కావాలంటే అలా అడగడం అలవాటు సుశీలకి. అందుకే అడిగాడలా.

"లేదు" తల అడ్డంగాఊపుతూఅన్నది.

"నీతో కొంచెం మాట్లాడాలి - ఇలా వస్తావా?"

వివేక్ ఆశ్చర్యంగా చూశాడు.

ఏమిటీవాళ ప్రత్యేకంగా మాట్లాడేది! అంత సీరియస్‌గా డిస్కస్ చేసే విషయం ఏమిటి!అమ్మ...రోజూలా లేదు.... ఎందుకని? ఆలోచిస్తూనే అన్నాడు.

"అలాగే! ఓ క్షణంలో వస్తాను".

"సరే.....హాల్లోకూర్చుంటాను....రా" ఆవిడ వెనక్కి తిరిగి హాల్లోకి వెళ్ళిపోయింది.

వివేక్‌కి తల్లి అంటే చాలా ఇష్టం.... పిల్లలందరిలోకి ఆఖరివాడు అవటం చేతేమో గారాబం కూడా అతనికి.

'అమ్మ ఇవాళ కొత్తగా ఉందేవిటి? ఏదో చిత్రంగా మాట్లాడుతోంది' వివేక్ గబగబా తలదువ్వుకొని, దువ్వెన జేబులో పెట్టుకుని హాల్లోకి నడిచాడు.

అతను రావటంచూసిన సుశీల దీర్ఘంగాఆలోచిస్తున్నదల్లానర్దుకొని కూర్చుంటూ, సోఫాలో తనప్రక్క స్థలం చూపించి "రా నాన్నా ఇలా కూర్చో" అన్నది.వివేక్ ఆవిడ ప్రక్కనే కూర్చున్నాడు.

ఆవిడ తన చేతిలో ఉన్న కవర్‌లోంచి ఓ ఫోటో తీసి చూపిస్తూ అన్నది.

"ఈ అమ్మాయి పేరు కవిత. బి.యస్సీ పాసైందట. చక్కగా సంగీతం పాడుతుందిట.. బాగా ఆస్తిపరులు...ఒక్కతే కూతురు. కులం, గోత్రం, జాతకం అన్నీ కలిశాయి. అన్ని విధాలా మనకనుకూలమైన సంబంధం. మీ నాన్నగారికి్కూడా నచ్చింది. నీ అభిప్రాయం చెపితే త్వరలో ముహూర్తం పెట్టిస్తాను."

వివేక్ ఫోటో చూశాడు. అందంగా ఉంది అమ్మాయి. కానీ....ఆవిడ వైపు చూస్తూ అన్నాడు. "నా పెళ్ళికి అంత తొందర ఎందుకమ్మా. మొన్ననేగా ఉద్యోగంలో చేరాను."

ఆవిడ కొద్దిగా నిట్టూర్చి, మెల్లని స్వరంతో అన్నది. "నీ పెళ్ళి బాధ్యత ఒక్కటే నాకు మిగిలింది నాన్నా. ఇది కూడా పూర్తి చేసేస్తే నాకింక విశ్రాంతి. నేను ఇప్పటికే చాలా అలసిపోయాను వివేక్. నాక్కొంత విశ్రాంతి కావాలి."

వివేక్ చిత్రంగా చూశాడు. ఆవిడ కంఠస్వరంలో ఏదో ఆవేదన తొంగిచూస్తోంది. మాటల్లో ఏదో బాధ....బరువు.

ఏం జరిగి ఉంటుంది? అమ్మలో హఠాత్తుగా ఇలాంటి మార్పుకి కారణం ఏమై ఉంటుంది? ఎప్పుడూ గంభీరంగా, ఓ యంత్రంలా అవిశ్రాంతంగా ఇంటి పనులు నిర్వర్తిస్తూ, ఇల్లే లోకంగా బ్రతికే ఆవిడ ఇవాళ తమాషాగా మాట్లాడుతోంది.

"ఏం జరిగిందమ్మా?" అనునయంగా అడిగాడు.

ఆవిడ కొంచెం సేపు మౌనం వహించింది.తరువాత అన్నది.

"ఏం లేదు. ఊరికినే.

ఒకొక్క బాధ్యతా....మెల్లమెల్లగా పూర్తి చేసుకుంటే మంచిది కదా! నేనూ పెద్దదాన్ని అవుతున్నాను. ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగా ఉంది. ఏ క్షణాన్నైనా రాలిపోవచ్చు" స్వరం కొంచెం వణికింది.

"అంత మాటెందుకు లేమ్మా. నీ ఇష్టం వచ్చినట్టు కానీ....అమ్మాయి బాగుంది" అన్నాడు వివేక్.

ఆవిడ మొహంలో ఆనందం వెల్లివిరిసింది ఓ క్షణం.కొడుకు తలమీద చేయివేసి నిమురుతూ అన్నది.

"నా మీద విశ్వాసం ఉంచు నాయనా... మీ అందరు బాగుండాలని నా కోరిక....నేనేం చేసినా మీ శ్రేయస్సు, సౌఖ్యం కోరే చేస్తాను"

"అందుకే కదమ్మా - నీ ఇష్టం అన్నాను... మరి నే వెళ్ళనా? నాక్కొంచెం బైట పనుంది" లేచాడు వివేక్.

ఆవిడ అసంతృప్తిగానే అనుమతించింది.వివేక్ వెళ్ళిపోయాడు.

కొడుకు ఇంకాస్సేపు తన దగ్గర కూర్చుంటే బాగుండుననిపించింది. పెద్ద కొడుకు తల్లిదండ్రుల దగ్గర ఉండటం ఇష్టం లేక, పెళ్ళికాగానే వేరే ఊరు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోయాడు. కూతురు ప్రస్తుతం పురిటికి వచ్చింది...బాబుకి నెల పూర్తయింది....ఇంకో నెలా రెణ్ణెల్లలో అత్తగారింటికి వెళ్ళిపోతుంది...

పిల్లలందరికీ రెక్కలొచ్చాయి. వారి, వారి గమ్యాన్ని వెతుక్కుంటూ వాళ్ళంతా ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోతారు....

ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, ఎన్నెన్ని ఎత్తుపల్లాలు అధిగమించి, కన్నీళ్ళ బరువుని... కష్టాల రాపిడినీ తట్టుకొని తానేర్పర్చుకున్న ఈ చిన్న గూట్లో మిగిలింది తానూ తన సహచరుడు. సంపాదించిందంతా పేకాటకి తగలేస్తూ నెలకింత అంటూ.... సరిపోయి, సరిపోని జీతం డబ్బులు ఆవిడ చేతుల్లో పెడితే మారుమాట్లాడకుండా అప్పుడు అత్తమామల్ని, ఆడపడుచునీ...తరవాత తన ముగ్గురు పిల్లల్నీ ఏ లోటూ తెలీకుండా కాపాడింది...

భర్త అహంకారాన్ని, మావగారి

చాదస్తాన్నీ భరించింది.... పిల్లల శక్తికి మించిన కోరికలను భరించింది... తన ఆశలూ, కోరికలూ మనసులోనే సమాధి చేసుకుని తన చుట్టూ ఉన్న వాళ్ళ ఆశలు నెరవేర్చింది. ఆకలేస్తే ఆవేదనని, దాహమేస్తే కన్నీళ్ళనూ సేవించి, చిరునవ్వుని అందరికీ పంచింది.

ఖర్చులు పెరిగినా, ధరలు పెరిగినా, బాధ్యతలు పెరిగినా, జీవన ప్రయాణం పెరిగినా, కాంతారావు ఆదాయం పెరిగినా, సుశీలకి నెలనెలా అతనిచ్చే జీతం డబ్బులు మాత్రం పెరిగేవి కావు.... భార్య ఇంతమందిని ఎలా సంతోష పెడుతోంది. తనెలా సంతోషపడుతోంది ఏమీ అతనికి అవసరం లేదు.... అతను పురుషాహంకారం మూర్తీభవించిన పురుషుడు. అతనికి తగ్గవాడే అతని తండ్రి.... అదే పోలిక పెద్ద కొడుకు ప్రతాప్‌కి వచ్చింది. అప్పుడు మావగార్ని, భర్తనీ భరించినట్టే కొడుకునీ భరించింది...

ఆవిణ్ణి అర్థం చేసుకున్న అత్తగారు కాలం చేయడంతో ఆవిడ మానసికంగా పూర్తిగా వంటరిదై పోయింది.కూతురు స్వర్ణకి తల్లిని అర్థం చేసుకునే సంస్కారం తప్ప దేవుడు అన్నీ ఇచ్చాడు.

వివేక్ ఒక్కడూ తల్లి దగ్గర చనువుగా, ఆవిడ మీద మమకారంతో ఉన్నాడిప్పటి దాకా.అయితే రేపు పెళ్ళయితే ఎలా ఉంటాడో! లోపల్నించి మనవడి ఏడుపుతో ఈ లోకంలోకి వచ్చింది సుశీల.

నెల తిరక్కుండానే వివేక్ పెళ్ళి కవితతో జరిగిపోయింది. ఊరి నుంచి ప్రతాప్, అతని భార్య పెళ్ళికి వచ్చారు... స్వర్ణ భర్త అచ్యుత్ కూడా వచ్చాడు... కొడుకులు, కోడళ్ళనీ, కూతురూ, అల్లుణ్ణీ.... మనవణ్ణీ కళ్ళ నిండుగా చూసుకుంది సుశీల. ఆవిడ కళ్ళల్లో చమరింపు... గుండెల్లో సంతృప్తి...

పాతికేళ్ళ నుంచీ కాంతారావు, కోపాన్నీ, అహంకారాన్నీ భరిస్తూ, అతనికి ఓ చిన్న ఇల్లు, పిల్లలూ, వాళ్ళకు జీవితం అన్నీ అందించింది.... తన కర్తవ్యం పూర్తయింది. ఎన్నిసార్లు ఆ ఇంటి నుంచీ, భర్త నుంచీ పారిపోవాలని గాఢంగా అనిపించేది... తల్లీ, తండ్రీ, అత్తగారు, సమాజమూ... ఆవిడకి అడ్డుగోడల్లా నిల్చారు.. కనీసం ఆత్మాభిమానం చంపుకుంటూ బ్రతికేకన్నా చచ్చిపోతే బాగుండుననుకుంది... కానీ పిల్లలు, వాళ్ళ బాధ్యతలు ప్రతిబంధకాలైనాయి. ఇంట్లోంచి వెళ్ళిపోతే ఎవరితోటో లేచిపోయిందన్న అపవాదు జీవితమంతా భరించాల్సి వచ్చేది. ఈనాడు అన్ని అవమానాలు సహించి, ఆశలు చంపుకుని, అస్తిత్వాన్ని చంపుకుని జీవితాన్ని నెట్టుకొచ్చినందుకు ఆదర్శ గృహిణి, సహనశీలి... సాక్షాత్తూ సుశీలే... అనే బిరుదులొచ్చాయి.

సుశీల విరక్తిగా నవ్వుకొంది.

ఏం చేసుకోవాలి ఈ బిరుదులన్నీ? జీవితంలో అమూల్యమైనవెన్నో కోల్పోయింది. సమస్యలు తప్ప, సరదాలు తెలీని, కన్నీళ్ళు తప్ప పన్నీరెరుగని...జలదరింపులు తప్ప పులకరింతలెరుగని జీవితం తనిది.... కాంతారావు భార్యగా తప్ప, సుశీలగా ఉనికే లేని పరాధీన.... ఎవరిక్కావాలి ఈ బిరుదులు? వివేక్ పెళ్ళయి పదహారు రోజులైంది. ప్రతాప్, అతని భార్య వెళ్ళిపోయారు.... ఇల్లంతా మామూలుగా అయిపోయింది.

వివేక్ కొత్త కాపురంలో ఆనందపుటంచులు చూస్తున్నాడు. తను నిర్ణయం తీసుకోబోయే ముందు వివేక్ గురించే ఆలోచించింది సుశీల... "వాడు బెంగ పెట్టుకుంటాడా తను లేకపోతే" అని కానీ ఇప్పుడనిపిస్తోంది భార్య వచ్చిందాకా తల్లి అవసరం అని.... కొంచెం బాధనిపించినా ఆవిడ సమాధానపడింది.... కారణం ఆవిడ అప్పటికే అన్ని బాధలకీ అలవాటుపడిపోయింది.

నెల గడిచింది.... స్వర్ణ కొడుక్కి మూడో నెల వచ్చింది. సుశీల మంచి రోజు చూసి, స్వీట్సు, చలిమిడి చేసి, కొత్త చీర, జాకెట్టు సారె ఇచ్చింది స్వర్ణకి. బాబుకి మురుగులు చేయించింది.

"అప్పుడే నా ఉనికి నీకు అంత ఇబ్బందిగా మారిందామ్మా? పంపించేస్తున్నావు?" నిష్టూరంగా అన్నది స్వర్ణ.

ఆవిడ నవ్వింది. "బాబుకి మూడో నెల వచ్చింది. వాళ్ళ నాన్న, తాత, మామ్మ వాణ్ణి చూడాలని కలవరిస్తున్నారు. నువ్వింకా ఇక్కడ ఉండటం భావ్యం కాదు స్వర్ణా. ఏ సమయంలో ఎవరు ఎక్కడ ఉండాలో, ఆ సమయంలో వారక్కడ ఉంటేనే విలువా, గౌరవం కూడా... అయినా ఎంత దూరం! ఊళ్ళోనేగా! నిన్ను చూడాలనిపించినప్పుడల్లా వస్తుంటాను సరేనా!"

"అంటే నేను రాకూడదా!" స్వర్ణ అడిగింది.

"అదేంటమ్మా.... నిన్ను రావద్దని ఎందుకంటాను? ఇది నీ పుట్టిల్లు... నీకిక్కడ సర్వాధికారాలున్నాయి. ఎప్పుడైనా రావచ్చు. వెళ్ళొచ్చు..... ఆ....పద....పద వర్జ్యం వచ్చేస్తుంది. మీ నాన్నగారి దీవెన తీసుకో." తొందర పెట్టింది.

స్వర్ణ తండ్రికి నమస్కరించి "వెళ్ళొస్తాను నాన్న" అన్నది.

"అలాగే! నీతో ఎవరొస్తున్నారు?" అడిగాడాయన.

"నేను వెళ్తున్నాను."

బాబునెత్తుకుని వచ్చింది సుశీల.

"అమ్మాయిని దింపి వెంటనే వచ్చేయ్.... వియ్యపురాలింట్లో తిష్టవేసేవ్... నాకు ఇబ్బందవుతుంది" అన్నాడు అదో రకంగా..

సుశీల మాట్లాడలేదు. వివేక్ ఆటో పిల్చుకొచ్చాడు. అందరి దగ్గరా సెలవు తీసుకుని ఆటో ఎక్కింది స్వర్ణ..... సుశీల అనుసరించింది.... ఆటో కదిలింది.

* * *

"అమ్మా 'సుశీలా'.

నీ ఉత్తరం అందింది. జీవితపు చివరి దశలో నీవు తీసుకున్న నిర్ణయానికి నేనెంతో సంతోషించాను. బాధ్యతలూ, బరువులూ సముద్రంలాంటివి... ఎన్ని బాధ్యతలు వదిలించుకున్నా.... సముద్రంలో నదులు కలుస్తున్నట్టే మళ్ళీ మళ్ళీ అనేకమైన బాధ్యతలు ఆ నదుల్లా వచ్చి చేరుతుంటాయి. ఇప్పటికైనా సంసార ఝంజాటం నుంచి విముక్తురాలవై నువ్వీ ఆశ్రమానికి రావాలని నిర్ణయించుకోవటం ఈ ఆశ్రమం చేసుకున్న పుణ్యం. నీవు కోరుకున్న ప్రశాంతత, విశ్రాంతి నీకిక్కడ తప్పక లభిస్తాయి. ఈ ఆశ్రమం తలుపులు నీ రాక కోసం సదా తెరిచే ఉంటాయి... నీకివే నా హృదయ పూర్వక స్వాగతం."

-మహర్షి విద్యానంద్

రెండు నెలల క్రితం తన పేరున మహర్షి వ్రాసిన ఉత్తరం తీసి మరోసారి చదువుకుంది సుశీల. నీళ్ళు నిండిన ఆమె కళ్ళకి అక్షరాలు అలుక్కుపోయినట్టు కన్పించాయి...

అయిపోయింది.... తను పూర్తిగా స్వతంత్రురాలైపోయింది.

పిల్లల పెళ్ళిళ్ళు అయిపోయాయి.

స్వర్ణ బాబుకి తల్లి కూడా అయింది.

వచ్చే ఏడాది కాంతారావు రిటైర్ అవుతాడు.

తన అవసరం ఉంటే అతనికే ఇంక... పిల్లలకి ఎవరికీ తన అవసరం లేదు.... ఇన్నేళ్ళ నుంచీ తనా ఇంట్లో ఓ పని మనిషిలానో, పని చేసే యంత్రంలానో బ్రతికింది.

ఇంట్లో ఎవరూ లేరు. అంతా ఆఫీస్‌లకెళ్ళిపోయారు.

సుశీల ఓసారి ఇల్లంతా కలయ తిరిగింది.

ఓ హాలు, ఓ బెడ్ రూమ్... ఓ డైనింగ్ రూమ్... ఓ వంటగది.... పదేళ్ళ క్రితం... తానెంతో కష్టపడి ఖాళీ సమయాల్లో అప్పడాలొత్తి అమ్మి, జాకెట్లు కుట్టి సంపాదించిన డబ్బు దాచిపెట్టి....ఊరికి దూరంగా అతి తక్కువ ధరలో స్థలం కొని, ఈ చిన్న ఇల్లు కట్టించింది.. కొత్త ఇంట్లోకి మారిన కాంతారావు భార్యని ఈ ఇల్లెలా కట్టించావు అని అడగలేదు....

"చూశావా! నిన్నో ఇంటికి యజమానురాల్ని చేశాను" అని కాలర్ సవరించుకున్నాడు. అప్పుడు కూడా ఆవిడ గొంతి విప్పి "కాదు. ఇది నా కష్టార్జితం" అని చెప్పలేదు.

అందంగా పొందిగ్గా తీర్చిదిద్దుకున్న ఇల్లు...

ఆ బెడ్ రూమ్‌లో తనకేనాడో స్థానం పోయింది....

తన పడక హాల్లోనే. ఏ అర్ధరాత్రి అవసరం వస్తే దగ్గర చేరేవాడు కాంతారావు.

'ఇన్నేళ్ళ నుంచి రాని మార్పు ఆయనలో ఇంక ఎప్పుడొస్తుంది' నిట్టూర్చింది సుశీల.

భార్య ఓ పనిముట్టుగా, కోరిక తీర్చే యంత్రంగా తప్ప, చీమూ, నెత్తురూ ఉన్న మనిషిగా ఆయన ఎప్పుడూ గుర్తించలేదు. ఆ మనిషికే మనసుందనీ, దానికీ ఆశలూ, కోరికలూ ఉంటాయని ఆయనకెప్పుడూ తోచలేదు. ఆ ఇంట్లో అడుగు పెట్టిన రోజే భర్తా, సమాజమూ కలిసి ఆమెలో లక్ష్మణరేఖ గీశారు. అది దాటి రాలేకపోయింది. దాని సరిహద్దుల్లో జీవించలేకపోయింది.

ఇవాళ ఏ సమాజాన్ని, భర్తనీ ఖాతరు చేయవలసిన పని లేదు... ఏ బాధ్యతలూ, బరువులూ తనకి ప్రతిబంధకాలు కాలేవు....

ఆవిడ సూట్‌కేస్ సర్దుకుంది.... అందులో ఆవిడ చీరలు, తన పెళ్ళి ఫోటో అమర్చుకుంది. మళ్ళీ ఫోటో తీసేసి కేవలం చీరలు, కొంత డబ్బు పెట్టి సూట్‌కేస్ మూసేసింది. తనిప్పుడు అన్ని బంధాలకూ అతీతంగా బ్రతకడానికి వెళ్తోంది... ఈ జ్ఞాపకాలన్నీ ఇక్కడే వదిలి శుభ్రమైన మనసుతో వెళ్తేనే ఆ వాతావరణంలో తాను మనశ్శాంతిగా జీవించగలదు. ఏ బంధం కూడా తన నిర్ణయాన్ని సడలించకూడదు.

తాళం వేసే ముందు మరోసారి చూసింది ఇల్లంతా. చిన్నప్పుడు సినిమాలో విన్నపాట గుర్తొచ్చింది. "పుల్లా , పుడకా ముక్కున కరిచి గూడును కట్టితివి" నుడులు తిరుగుతున్న కన్నీళ్ళని పెదాల మధ్య బిగించేసి తాళం వేసింది.... తాళం చేతులు పక్కింటమ్మాయికి ఇచ్చి కాంతారావు వస్తే ఇమ్మని చెప్పింది.

ఎన్నడూ ఇల్లు దాటని సుశీల వంటరిగా, సూట్ కేస్‌తో వెళ్తోంది. ఆ అమ్మాయి ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయింది.

సుశీల రోడ్డు మీదికొచ్చి, ఆటో పిల్చింది..... ఆటో దగ్గరికి రాగానే ఎక్కి కూర్చుని, రైల్వే స్టేషన్‌కి పోనీయ్" అన్నది

ఆటో కదిలింది.